# నవతరం

తెలుగు దినపత్రిక

RNI NO. APTEL/2014/58326

సంపుటి : -13 సంచిక : 91 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

01-02-2026 ఆదివారం వెల : 1 /- పేజీలు : 4


# తిరుమల లడ్డూ పై కూటమివి కూతలే

- శ్రీవారిని, లడ్డూని అవమానించిన కూటమి
- రాజకీయ దురుద్దేశంతోనే అప్పట్లో టిడిపి నేతలు కల్తీ లడ్డూ ప్రచారం
- సిబిఐ విచారణతో బట్టబయలైన చంద్రబాబు, కూటమి నేతల కుట్రలు
- లడ్డూ ప్రసాదం పై చేసిన విష ప్రచారానికి లెంప లేసుకోవాలి
- పలాసలో ఎమ్మెల్యేకు పి జి ఎఫ్ త్వరలో చూపిస్తాం
- తిరుమల లడ్డూ పై చంద్రబాబు సర్కార్ అపచారానికి పరిహారంగా వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు






**నవతరం -పలాస**

తిరుమల లడ్డూ లో వినియోగించిన నెయ్యి జంతువుల కొవ్వుతో కల్తీ జరిగిందని గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేసిన కూటమి ప్రభుత్వ ముఖ్య నేతల వక్రబుద్ధి మారాలని కోరుతూ వైయస్సార్సీపి పలాస నియోజకవర్గ పార్టీ నేతలు, కార్యకర్తలు స్థానిక మున్సిపాలిటీ లోని ఉదయపురం లో గల శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం లో శనివారం కొబ్బరికాయలు కొట్టారు. పలాస నియోజకవర్గ కోఆర్డినేటర్, రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో నియోజవర్గం నలుమూలల నుంచి విచ్చేసిన వైఎస్ఆర్సిపి శ్రేణులతో ఈ కార్యక్రమం నిర్వహించారు. -మిగతా 3లో

## జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

# మధ్యవర్తిత్వంతో కేసులకు మోక్షం

**నవతరం -శ్రీకాకుళం**




కోర్టుల్లో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులను మధ్యవర్తిత్వం ద్వారా సత్వరమే పరిష్కరించుకోవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. ఎంపిక చేసిన న్యాయవాదులకు గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న 40 గంటల ప్రత్యేక శిక్షణా తరగతులు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మధ్యవర్తిత్వ ప్రక్రియలో మెలకువలు నేర్చుకోవడం వల్ల న్యాయవాదులకే కాకుండా, కక్షిదారులకు కూడా ఎంతో మేలు జరుగుతుందన్నారు. శిక్షణ పొందిన న్యాయవాదులు ఈ ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని, ఉభయ పక్షాల అంగీకారంతో కేసులను పరిష్కరించి ప్రజలకు భారత్ తగ్గించాలని జడ్జి సూచించారు. ఈ శిక్షణలో సీనియర్ ట్రైనర్లు వి.పి. తనకచన్, పి.జి. సురేష్‌లు పాల్గొని మధ్యవర్తిత్వంలోని న్యాయపరమైన చిక్కులు, వాటిని పరిష్కరించే విధానాలపై న్యాయవాదులకు విస్తృత అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. హరిబాబు, శిక్షణ పొందిన మధ్యవర్తిత్వ న్యాయవాదులు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# సంస్కృతీ సంప్రదాయాలకు పెద్ద పీట వేయాలి

**నవతరం -ఎచ్చెర్ల**




మన సంస్కృతీసంప్రదాయాలకు పెద్ద పీట వేయాల్సిన గురుతర బాధ్యత సమాజం, మీడియాపై ఉందని డా.బి.ఆర్.అంబేద్కర్ వర్సిటీ ఉపకులపతి ఆచార్య కె.ఆర్.రజని అన్నారు.శనివారం తన ఛాంబర్ లో విశాఖ సంస్కృతి మాసపత్రిక, వార్షిక కేలెండర్లను ఆవిష్కరించిన సందర్భంగా మాట్లాడారు.నైతికవిలువలు(ఎథిక్స్), తత్వశాస్త్రం వంటి అంశాలను విద్యాలయాలలో సబ్జెక్టులుగా ప్రవేశ పెడితే సత్సమాజం ఆవిష్కృతమవుతుందని హితవు పలికారు.విశాఖసంస్కృతి మాసపత్రిక నైతికతకు అగ్రతాంబూలం ఇవ్వడం స్వాగత పరిణామమని పేర్కొన్నారు.విశాఖ సంస్కృతి ఎడిటర్ శిరేల సన్యాసిరావు మాట్లాడుతూ మాస పత్రికను పదమూడేళ్లగా నడుపుతున్నామని, విలువలతో కూడిన వ్యాసాలకు సముచిత స్థానం కల్పిస్తూ పాఠకుల ఆదరణకు పాత్రులవుతున్నామని నివేదించారు.రిజిస్ట్రార్ డా.బి.అడ్డయ్య ప్రత్యేక ఆహ్వానితునిగా పాల్గొన్నారు జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్సు శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గుంట లీలా వరప్రసాదరావు మాట్లాడుతూ ఈ మాసపత్రిక కొత్తపుంతలు తొక్కుతూ విజయపథంలో పయనిస్తోందన్నారు.పత్రికను నడపడం కొత్తిమీద సాములాంటిదని, అయినప్పటికీ అంకిత భావంతో ఎడిటర్ సన్యాసిరావు ఈ పత్రికను నిర్వహిస్తున్నారని కొనియాడారు.నామ విజ్ఞాన వేత్త,అనుభవ పాత్రికేయులు వాండ్రంగి కొండలరావు మాట్లాడుతూ తాను పత్రిక అవతరించినప్పటినుంచి క్రమంతప్పకుండా చదువుతున్నానని అన్నారు.రాష్ట్రంలో ఈ పత్రికకు ప్రముఖ స్థానం ఉందని ప్రశంసించారు.విశ్రాంత గురుకుల విద్యాలయం సూపరింటెండెంట్ బోను ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

**నవతరం -పాతపట్నం**




నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. పాతపట్నం నియోజకవర్గ కేంద్రంలోని కేఎస్ఎం ప్లాజాలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో నిర్వహించిన శాఖల వారీ సమీక్షా -మిగతా 2లో

# పేదల సంక్షేమానికి సంకేతం పింఛన్లు పంపిణీ కార్యక్రమం

- గౌరవ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- కోటబొమ్మాళి మండలంలో విస్తృతంగా పర్యటించిన మంత్రి
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించిన మంత్రి
- నియోజకవర్గంలో రూ.700 కోట్లతో మౌలిక సదుపాయాల అభివృద్ధి
- రైతు సంక్షేమమే లక్ష్యం వంశధార రిజర్వాయర్ పనులకు రూ.16.50 కోట్లు మంజూరు
- రూ.3.67 లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవం చేసిన మంత్రి

2లో



## పలాస - కాశిబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్లగిరి బాబు-ఉష

# దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు



**నవతరం - పలాస**

వైయస్ఆర్సీపీ సీనియర్ నేత, పలాస- కాశీబుగ్గ పురపాల సంఘం చైర్మన్ బల్ల గిరిబాబు - ఉష దంపతుల వివాహ వార్షికోత్సవశీ సందర్భంగా శనివారం పలాస నియోజకవర్గం నలుమూలల నుంచి పలువురు ప్రముఖులు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. చైర్మన్ బల్ల గిరిబాబు అత్యంత సన్నిహితులు వివాహ వార్షికోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి సీనియర్ నేత మద్దు రాంప్రసాద్ మాట్లాడుతూ, చైర్మన్ బల్ల గిరిబాబు ఎప్పుడు ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేస్తూ, తన సేవా తత్వంతో అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని, అలాగే ఆయన సతీమణి బల్ల ఉషారాణి మున్సిపల్ కౌన్సిలర్ గా కొంతకాలం సేవలు అందించారని, ప్రస్తుతం లైన్స్ క్లబ్ మహిళా విభాగం తరఫున పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ, మానవతా భావంతో ప్రతి ఒక్కరి గుండెల్లో ప్రత్యేక స్థానం, ఈ జంట సమాజానికి స్ఫూర్తిగా నిలిచింది అన్నారు. వీరి ప్రయాణం సుఖ సంతోషాలతో నిండిపోవాలని, ప్రేమాభిమానాలు మరింతగా పెరగాలని, -మిగతా 2లో

ఎడిటోరియల్

# వొట్టిమాటలు..!

కేంద్రబడ్జెట్ సందర్భంగా బుధవారం పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేసిన ప్రసంగం వాస్తవ పరిస్థితులకు భిన్నంగా ఉన్నది. వికసిత్ భారత్ చుట్టూ 'అభివృద్ధి'ని అమర్చి అసలు విషయాలను పక్కనపెట్టింది. గత పదేళ్లలో దేశంలోని సుమారు ఇరవై ఐదు కోట్ల ప్రజలు పేదరికం నుంచి బయపడ్డారన్నది ఆమె ఉపన్యాసంలోని ప్రధానమైన అంశం. దీన్ని ఏ విధంగా లెక్కించారో చెప్పలేదు. ఒకపక్క ప్రపంచ ఆకలి సూచీ ప్రకారం ఆకలిగొన్న జనాభా అత్యధికంగా ఉన్న దేశాల్లో భారత దేశం ఎగబాకింది. ఇప్పుడది నూట పదిహేను దేశాలకు గాను వందవ స్థానానికి చేరింది. కానీ, మన దేశంలో పేదరికం దాదాపు అదృశ్యం అయిపోయినట్టు లెక్కలు చూపడం ఆందోళనకరం. గణాంకాల ఆధారంగా చెప్పబడే పేదరికం సామాజిక వాస్తవాలను సాక్షాత్కరించదు.
ఆరోగ్యం, విద్య, మంచి నీరు, ఆహారం, ఆర్థిక భద్రత వంటి అంశాలను కలిపి పేదరికాన్ని నిర్వచించాలి. నేటికీ ప్రజానీకంలో అత్యధిక శాతం నెలనెలా వచ్చే ఐదుకిలోల ఉచిత బియ్యం కోసం ఎదురు చూడటం దేశంలోని వాస్తవ పరిస్థితులకు ప్రతిబింబం. దేశంలోని తొంభై శాతం ప్రజల సంపదంతా పదిశాతం కుబేరుల వద్ద పోగై ఉన్నది. ఇంత తీవ్రమైన అస మానతలకు కారణం పెట్టుబడిదారి ప్రయోజనాల్ని పాలకులు నెరవేర్చిన ఫలితం! ఇంకా.. జలజీవన్ కింద ప్రజలందరికీ తాగునీరందిస్తున్నామని చెప్పారు. మారుమూల పల్లెలే కాదు, స్వచ్ఛమైన నీరందని పట్టణాలు, నగరాలు కూడా దేశంలో ఉన్నాయి. ఇటీవల నీరు కలుషితమై మధ్యప్రదేశ్‌లో పదిహేను మందికిపైగా మరణించారు. మహారాష్ట్రలో కొంతమంది ఆస్పత్రిపాలయ్యారు. ఈ రెండు రాష్ట్రాలను పాలించేది 'డబులింజన్' సర్కార్‌లే. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇలా ఉంటే వాటిని కప్పిపుచ్చడం సమంజసమేనా? దేశంలో పదికోట్ల గ్యాస్ కనెక్షన్లు ఇచ్చినట్టు చెప్పారు. మరి గ్యాస్ ధర ఎందుకు పెంచారు? బీజేపీ అధికారంలోకి రాక ముందు రూ.400 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర తాజాగా రూ. వెయ్యికి ఎకబాగింది. దీని గురించి మాట్లాడకుండా గ్యాస్ కనెక్షన్ల గురించి మాట్లాడం హాస్యాస్పదం. పెరిగిన నిత్యావసరాల ధరలు సామాన్యులకుముచ్చెమటలు పట్టిస్తున్నాయి. పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్నంటాయి. "ఏం కొనేటట్టు లేదు..ఏం తినేటట్టు లేద'న్న పాట ప్రజల జీవితంలో భాగమైపోయింది. దీని గురించి ఎవరూ మాట్లాడరేం? గమ్మత్తయిన విషయమేమంటే? జీఎస్టీ స్లాబుల తగ్గింపుతో ప్రజల కొనుగోలు శక్తి పెరిగిందని చెప్పుకొచ్చారు. జీఎస్టీని తీసుకొచ్చింది కార్పొరేట్లకు లాభాలు కట్టబెట్టేందుకు. ఉత్పత్తి చేసిన వస్తువులు అమ్ముడుపోక మళ్లీ సవరణలు చేసింది కూడా వారి కోరిక మేరకే! దాన్ని కొనుగోలుశక్తి పెరగడంగా చూపితే ఇంతకన్నా మోసకారితనం వేరే ఉండదు! అయినా ఆ స్లాబులు కూడా సామాన్యుల దరిచేరేవి కావు, అందులోనూ ధనవంతులకే ఉపయోగాలెక్కువ. ధాన్యం ఉత్పత్తిలో ప్రపంచంలోనే మొదటిస్థానంలో ఉన్నామని చెప్పారు. దేశ, విదేశాల నుంచి దిగుమతులు చేసుకుంటున్న ఉత్తత్తుల మాటేమిటి? ట్రంప్ టారిఫ్‌లతో వ్యవసాయానికి ముప్పు ముంచుకొస్తున్న మోడీ మౌనముద్ర వీడలేదు. పైగా ఆకలిచావులు ఆగడం లేదు. రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. వారికి ఇస్తామన్న కనీస మద్దతు ధర హామీ ఏమైనట్టు? పంటభూమిలోనే నిలువెత్తు గోయితీసి కప్పిపెట్టారు! అలాగే రాష్ట్రపతి ప్రసంగంలో 2047 నాటికి వికసిత్ భారత్‌గా దేశం రూపుదిద్దుకుంటుందని, ఆ లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు.
మరోపక్క దేశాన్ని పట్టిపీడిస్తున్న నిరుద్యోగం ఊసే ఎత్తలేదు. ఏడాదికి రెండుకోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీ ఎప్పుడో అటకెక్కింది. టీలు, పకోడీలు అమ్ముకోవడం కూడా ఉద్యోగమే అన్న వారికి నిరుద్యోగం ఏం కనిపిస్తుంది? పొరుగున ఉన్న పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లతో పోల్చిన మనదేశంలోనే నిరుద్యోగం ఎక్కువ. ఎనభైమూడు శాతం ఇంజనీరింగ్ పట్టభద్రులకు ఉద్యోగాలు లేవని పలు నివేదికలు స్పష్టం చేస్తున్నవి. సెంటర్‌ఫర్ మానిటరింగ్ ఎకానమీ నివేదిక దేశంలో 7.2శాతం నిరుద్యోగం ఉన్నట్టు వెల్లడించింది. వీటన్నింటిని దాచి ఆత్మనిర్భర్ భారత్‌ను వల్లెవేయడం ప్రజల్ని ఏమార్చడమే.
మరీ అన్యాయమైన విషయం ఏమిటంటే? గ్రామీణ ఉపాధి కల్పన కోసం వీబీ జీ రామ్ జీ తీసుకొచ్చినట్టు చెప్పారు. మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి దానిస్థానంలో ఉపాధికి గ్యారంటీలేని పథకాన్ని రూపొందించారు. ఒక హక్కుగా ఉన్న ఉపాధి, పాలకుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడేలా చేయడం, దాన్ని గొప్పగా ప్రకటించుకోవడం మోడీ సర్కార్‌కే చెల్లింది. రాష్ట్రపతి ప్రసంగమంతా వికసిత్ భారత్, అభివృద్ధి, భారత్ విజయం, అనే 'కథనంగా' సాగింది. సమాజ వ్యధల, ప్రధాన ఆర్థిక సవాళ్లపై సమగ్ర విశ్లేషణ ఇవ్వలేదు. అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ చుట్టూ అధికార ఎజెండాను ప్రతిబింబించింది. సామాజిక సంక్షేమం, నిరుద్యోగం, ఉపాధి అంశాల ప్రాధాన్యతను విస్మరించింది.

# అక్షర కిరీటధారికి... అక్షర కుసుమాంజ

(శ్రీ పోలయ్య కవి కూకట్లపల్లి గారికి అందిస్తున్న
అభినందన మందారమాల)

ఓ ప్రియ నేస్తమా...
ఓ పోలయ్య కవి శేఖరా...
మీ అక్షరమే ఆయుధమై...
మీ కలం కరకు కత్తిగా మారిన వేళ
కుల రక్కసి కోరలు తెగిపడే...
మీ గళం గాండీవమై మ్రోగిన వేళ
అవినీతి జలగల అక్రమార్కుల
పునాదులు కదిలిపోయే..

మీ చూపు...నిశితం...
మీ మనసు...నవనీతం...
మీ కన్ను...సామాజిక
అడవిని శోధించే డేగ కన్ను
మీ పెన్ను...
చీకటిని చీల్చే సూర్య కిరణం
మీ ఆలోచనలు...
వెన్నెల వెలుగునిచ్చే జ్ఞానదీపికలు
మీ హృదయం...
సమతా మమతలకు వెన్నెల వాకిలి...

ఐదువేల సుందర
కవితాశిల్పాలను చెక్కిన ...
అక్షర శిల్పి...మీరు
సహస్ర కవితల మేరుశిఖరం మీరు...

మతమనే...కలుపుమొక్కను
వ్రేళ్లతో సహా పెకిలించివేసిన
కులమనే...గజ్జికుక్కను
సమాజపు పొలిమేరలు దాటించిన
నిఖార్సైన మానవతావాది మీరు...

అంబేద్కర్ ఆశయ పథంలో...
అణగారిన చితికిన బతుకుల
పక్షాన నిలిచిన గొంతుక మీరు
సమసమాజ నిర్మాణమే శ్వాసగా
సాగుతున్న అక్షరయోధులు మీరు...

అంధవిశ్వాసాల భూతాలను
అక్షరాలతో బంధించిన
అభ్యుదయ భావాల
అరుణోదయ కిరణం మీరు...

ఓ ప్రియ నేస్తమా...
ఓ పోలయ్య కవి శేఖరా...
కాలం మీ సంతకం కావాలి...
పీడిత ప్రజల
కన్నీటిచుక్కల్ని తుడుస్తూ
చరిత్రపుటల్లో మీరు
వేగుచుక్కగా మెరవాలి...
మీ కలం సూర్యోదయ కిరణమై
బడుగు జీవుల బ్రతుకుల్లో కమ్ముకున్న చిమ్మ
చీకట్లను చీల్చివేయాలి

మీరు నిత్యం జనం మనిషిగా...
జన హృదయ విజేతగా...
మహోన్నత సాహిత్య శిఖరాలను
అధిరోహించాలి..! అందుకే
ఓ పోలయ్య కవిగారు అందుకోండి...మా ఈ
స్నేహపూర్వక అక్షరాభినందనమాల

మీ ఆత్మీయ అక్షర నేస్తం
సొపాటి ప్రభాకర్...బ్రాహ్మణ కోడూరు



కవి రత్న
సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

# పేదల సంక్షేమానికి సంకేతం పింఛన్ల పంపిణీ కార్యక్రమం

**నవతరం -కోటబొమ్మాళి**

శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలంలో గౌరవ రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య శాఖామాత్యులు కింజరాపు అచ్చెన్నాయుడు విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. లఖందిద్ది గ్రామంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ, "ప్రతి నెలా ఒకటో తేదీ పేద ప్రజలకు పండుగలా మారింది" అని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో పెరిగిన పెన్షన్లను లబ్ధిదారులకు అందిస్తూ, ప్రభుత్వం మాట ఇచ్చినట్లుగానే సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. వృద్ధులు, వికలాంగులు, ఇతర అర్హులైన లబ్ధిదారులు పెరిగిన పెన్షన్లతో సంతోషం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 64 లక్షల మందికి పెన్షన్లు అందిస్తూ రూ.50 వేల కోట్లకు పైగా వ్యయం చేస్తున్నామని వివరించారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు రూ.700 కోట్లతో మౌలిక సదుపాయాల అభివృద్ధి చేపట్టామని, రైతులకు సాగునీరు అందించేందుకు వంశధార రిజర్వాయర్ పనులకు రూ.16.50 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. రైతులకు రాజముద్రతో పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని, సూపర్-6 హామీలన్నింటినీ 20 నెలల వ్యవధిలోనే నెరవేర్చామని పేర్కొన్నారు. అర్హులైన వారికి నూతన పెన్షన్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ సహకారం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి సమర్థ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోందని అన్నారు. వచ్చే నెలలో అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేసి రైతుల ఖాతాల్లో జమ చేస్తామని వెల్లడించారు. తొలుత పలు అంతర్గత రహదారులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించగా, లఖందిద్ది గ్రామంలో రక్షిత మంచినీటి సరఫరా పథకాన్ని ప్రారంభించారు.

**గత ప్రభుత్వం సాగునీటి రంగాన్ని విస్మరించింది**

గత ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో సాగునీటి రంగాన్ని పూర్తిగా విస్మరించిందని మంత్రి తీవ్రంగా విమర్శించారు. ఆ కాలంలో రాష్ట్రంలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా చేపట్టలేదని, గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పించలేదని అన్నారు. సర్వే రాళ్లపై బొమ్మలు వేసి వందల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. 20 నెలల్లో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని చూసి గత పాలకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. భూముల రీ--సర్వే పేరుతో రెవెన్యూ వ్యవస్థను అస్తవ్యస్తం చేశారని, రైతులకు ఐదేళ్లపాటు సాగునీరు అందించలేదని అన్నారు. రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

**ప్రతి ఇంటికీ తాగునీరు**

నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు ప్రభుత్వం రూ.600 కోట్ల రూపాయలు మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. వాటర్ ట్యాంకులు నిర్మించి, కుళాయిల ద్వారా నీటి సరఫరా చేస్తామని చెప్పారు. 2014-19 మధ్యకాలంలో తాను చేపట్టిన అభివృద్ధి పనులు తప్ప గత ఐదేళ్లలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా జరగలేదని అన్నారు. గ్రామీణ రహదారుల అభివృద్ధి లేక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు.

**అన్నా క్యాంటీన్‌ను సందర్శించిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

కోటబొమ్మాళిలోని అన్నా క్యాంటీన్‌ను మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సందర్శించారు. క్యాంటీన్‌లో అందుతున్న భోజన నాణ్యత, నిర్వహణ తీరును పరిశీలించారు. భోజనం చేస్తున్న ప్రజలతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. పేదలు, నిరుపేదలకు అన్నా క్యాంటీన్ ఎంతో ఉపయోగకరమని మంత్రి పేర్కొన్నారు.

**రైతులకు గాబుతీసిన వ్యవసాయ పరికరాలు పంపిణీ**

రైతులకు అవసరమైన గాబుతీసిన వ్యవసాయ పరికరాలను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆధునిక వ్యవసాయ పరికరాల వినియోగంతో ఖర్చులు తగ్గి దిగుబడులు పెరుగుతాయని తెలిపారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని పేర్కొంటూ, వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించుకోవాలని రైతులకు సూచించారు.

# పలాస - కాశిబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్లగిరి బాబు-ఉష దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు

మొదటిపేజీ తరువాయి

భవిష్యత్తులో కూడా మరిన్ని మానవతా సేవలు ప్రజలకు అందించి మరింత శ్రేయస్సు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. దేవుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఈ జంటపై ఉండాలని, జీవితంలో ప్రతి సంవత్సరం మరింత ఆనందం, ప్రేమ, విజయాలతో నిండిపోవాలని ఆయన కోరారు.
ఈ కార్యక్రమంలో డబ్బీరు నాగు, బడగల మధు, చక్రి,ప్రసాదు, మురళి తదితరులు పాల్గొన్నారు.

# 31 డివిజన్ దండి వీధిలో ఎన్టిఆర్ పింఛను భరోసా

**నవతరం -శ్రీకాకుళం**

శ్రీకాకుళం నగరం లోని 31 డివిజన్ దండి వీధి, పట్నాయక్ కాలనీ లలో ఈ రోజు ఎన్టిఆర్ పింఛను భరోసా ను డివిజన్ ఇంచార్జి ,ఏపి కనీసవేతనాలు సలహా మండలి సభ్యులు విభూతి సూరిబాబు, సచివాలయ సిబ్బందితో కలిసి లబ్ధిదారులకు శనివారం అందజేశారు.
ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు పింఛను ఒకసారిగా వెయ్యి రూపాయలు పెంచారని, అదే జగన్ వస్తే విడతలు వారీగా పెంచే వారని ఎద్దేవా చేశారు.సూపర్ సిక్స్ హామీలను అమలు చేశారని, స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ కూడా నియోజకవర్గం అభివృద్దిపై ప్రత్యేక దృష్టి సారించినట్టు చెప్పారు. క్షేత్ర స్థాయిలో ఆయన పర్యటిస్తూ ప్రతి పనిలో వందశాతం సక్సెస్‌ను తీసుకువస్తున్నట్లు చెప్పారు.



ఈ కార్యక్రమం లో అభూ ఖురేషి, రామారావు, తరుణ్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

మొదటిపేజీ తరువాయి

సమావేశానికి ఆయన హాజరయ్యారు.
ఎకనామిక్ విజన్ ప్లాన్ 2047లో భాగంగా ఐదు మండలాల్లో ప్రస్తుతం జరుగుతున్న పనుల పురోగతిని ఈ సందర్భంగా కలెక్టర్ క్షుణ్ణంగా సమీక్షించారు. ముఖ్యంగా ఉద్దానం ఫేజ్-2 జల్ జీవన్ మిషన్ పనులపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. తాగునీటి సరఫరా ప్రాజెక్టులతో పాటు వంశధార రిజర్వాయర్ ఆయకట్టు అభివృద్ధి, బి.ఆర్.ఆర్ బ్యారేజీ బ్రిడ్జి పనులు, ఎత్తిపోతల పథకాలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయడం ద్వారా రైతులకు సత్వరమే ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అధికారులకు సూచించారు. ఆర్.డబ్ల్యూ.ఎస్, పంచాయతీ రాజ్, రోడ్లు-భవనాలు, విద్యాశాఖ, విద్యుత్ శాఖల వారీగా పనుల వివరాలను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ డి.సత్యనారాయణ, ఆర్డీఓ కృష్ణమూర్తి, వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# మహిమాన్వితం మాఘ పూర్ణిమ స్నానం





కాల మహాత్యాన్ని గురించి మన పూర్వీకులు స్పష్టంగా తెలుసు కాబట్టే ,వారి కాలానికి అంతటి ప్రాముఖ్యత ఇచ్చారు. మనం పురాణాల్లో ఒక్కొక్క నెల యొక్క మహాత్యం వివరించబడింది. అందులో కార్తికంలో దీపానికి, మాఘమాసంలో స్నానానికి ప్రాధాన్యతమివ్వబడింది.

మాఘ మాసంలో సూర్యోదయానికి ముందే భగవాన్ నామ స్మరణతో స్నానం చేయడం సర్వపాపహరణం పుణ్యప్రదం ముఖ్యంగా మాఘమాసంలో వచ్చే ఆదివారాలు అత్యంత మహిమాన్వితమైనవి. ఆరోజు సూర్య భగవానునికిక్షీరాన్నాన్ని నివేదించి ఆదిత్య స్తోత్రం పఠిస్తే అరిష్టాలను, ఆరోగ్యాన్ని తరిమికొస్తుంది.

సముద్ర జలాలు కాక ప్రయాగలోని త్రివేణి సంగమంలో కూడా వేలాది మంది ఈ రోజు స్నానాలు చేస్తారు. అక్కడ ఈ రోజు మాఘ మేళా జరుగుతుంది. తమిళనాడులోని కుంభకోణం, కన్యాకుమారి, రామేశ్వరం, రాజస్థాన్లోని పుష్కర్ వద్ద కృష్ణా జిల్లాలోని హంసల దీవి వద్ద ఆ నది సముద్రంలో కలిసే చోట కూడా ఎక్కువ మంది స్నానాలు చేస్తారు.

ఈ రోజు మాఘపూర్ణిమ లేదా మహా మాఘి. ఈ తిథి స్నాన, దాన, జప పారాయణాదులకు శ్రేష్టమైనది. ఈ తిథిని వ్యర్థంగా గడపరాదన్నది శాస్త్ర వచనం.ఈ రోజు సముద్ర స్నానం చేయడం మహా పవిత్రం. నాది స్నానం కుదరని వారు కనీసం నువ్వులను దానం చేయడం వల్ల శుభం కలుగుతుంది.ఇది వీలు లేని పక్షంలో పుణ్య నదీ స్నానం గంగ, యమున, నర్మద, సరయు, తపతి, గోదావరి, కృష్ణ, కావేరి నదుల్లో స్నానాలు చేస్తారు. ఈ స్నానాల వల్ల అన్ని పాపాలు తొలగి మోక్షానికి మార్గం సుగమం అవుతుందని భావిస్తారు. ఈ తిథినాడు దానం చేస్తే బ్రహ్మలోక ప్రాప్తి అని బ్రహ్మ వైవర్త పురాణం చెబుతోందని పెద్దలు పేర్కొంటుంటారు. అలాగే కొందరు పితృ దేవతారాధన చేస్తారు. ఈ రోజు ముఖ్యంగా విష్ణువును ఆరాధిస్తారు. కొన్ని ప్రదేశాల్లో పార్వతీదేవిని బృహస్పతిని ఆరాధిచడం ఉంది. మఘ నక్షత్రంలో పౌర్ణమి కలవడం వల్ల. ఈ నెలకు మాఘమాసం అనే పేరు వచ్చిందనేది తెలిసిందే. మఖ నక్షత్రానికి బృహస్పతి అధిపతి కనుక ఆయనను ఆరాధించడం కొన్నిచోట్ల ఉన్న సంప్రదాయం. సముద్రజలాలు కాక ప్రయాగలోని త్రివేణి సంగమంలో కూడా వేలాది మంది ఈ రోజు స్నానాలు చేస్తారు.అక్కడ ఈ రోజు మాఘమేళా జరుగుతుంది.

తమిళనాడులోని కుంభకోణం, కన్యాకుమారి, రామేశ్వరం, రాజస్థాన్లోని పుష్కర్ వద్ద కృష్ణా జిల్లాలోని హంసల దీవి వద్ద ఆ నది సముద్రంలో కలిసే చోట కూడా ఎక్కువ మంది స్నానాలు చేస్తారు. తమిళనాడులోని ప్రసిద్ధ మీనాక్షి దేవాలయం సమీపంలోని మరియమ్మన్ తప్పకులం సరోవరంలో ఈ రోజు మీనాక్షి సుందరేశ్వరుల తెప్పోత్సవం జరుగుతుంది.

మాఘ పౌర్ణమికి మరో వైశిష్ట్యం కూడా ఉంది. ఇది సతీదేవి ఆవిర్భవించిన తిథిగా చెబుతారు. దానికి సంబందించి ఒక పురాణ కథ ప్రచారంలో ఉంది. ఒక సారి పార్వతీదేవి దక్షిణావర్త శంఖ రూపాన్ని ధరించి సరయూ నది సమీపంలోని కాళింది మడుగులోని ఒక పద్మంలో పడింది. దక్ష ప్రజాతి సరయూ నదిలో స్నానం చేస్తూ ఆ పద్మంలోని శంఖాన్ని చూశాడు. పద్మంలో శంకం ఉండటం ఏమిటని అబ్బుర పడ్డాడు. పరిశీలించి చూడగా అది దక్షినావర్త శంఖం. దక్షిణావర్త శంఖం అరుదైనది, పవిత్రమైనది. అంతేకాక అది కలిగి ఉన్న వారికి మహాభాగ్యం కలుగుతుందని చెబుతారు. దక్షిణావర్త శంఖం వైశిష్ట్యం తెలిసిన దక్ష ప్రజాపతి దానిని తీసికెళ్ళాలని భావించాడు. అయితే ఆయన స్పర్శ తగలగానే ఆ శంఖం కాస్తా అందమైన ఆడ శిశువుగా మారింది. దక్షినావర్త శంఖం స్పర్శ వల్లనే దక్ష ప్రజాపతికి అమ్మవారిని కుమార్తెగా పెంచుకునే మహాభాగ్యం కలిగింది. దక్ష ప్రజాపతి ఆ కన్యను తీసికెళ్లి అల్లారు ముద్దుగా పెంచాడు. ఆమె సతీదేవి. సహజంగా పార్వతీదేవే ఆరూపంలో రావడం వల్ల ఆమెకు శివుని పైనే మక్కువ ఏర్పడింది. ఆ ప్రకారమే ఆయనతో వివాహంచేశారు. దక్షిణావర్త శంఖ రూపంలో ఉన్న అమ్మవారు శిశువుగా మారిన తిథి మాఘ పూర్ణిమ, ఇక కుంభకోణంలో ఈ రోజు ప్రత్యేక పూజలు జరుగుతాయని, దానికి కారణం ఉంది. కుంభకోణం వద్ద ఒక కొండ ఉంది. దానిని స్వామిమలై అంటారు. అక్కడ స్వామిని మహా విద్యావేత్తగా భావిస్తారు. ఆయన ఒక సందర్భంలో తన తండ్రి అయిన శివునికే ఒక విషయాన్నిఆ విషయాన్ని ఆయన బోధించాడని చెబుతారు. చెప్పినది మాఘ పౌర్ణమి నాడేనని చెబుతారు. ఆ విధంగా ఈ తిథి పుణ్య ప్రదమైనదిగా పేరుపొందింది. కుంభకోణంలో మహామాఘితో సంబంధం ఉన్న ఒక కోనేరు ఉంది. మాఘ పౌర్ణమినాడు గంగ, యమున, గోదావరి, సరస్వతి, నర్మద, కృష్ణ కుమారి, కావేరి పయోషిణి అనే తొమ్మి ది నదుల పవిత్రత ఆ కోనేరులో ప్రవేశిస్తుందని చెబుతారు. ఆ రోజున అక్కడ స్నానాలు చేసేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. ఇక ఒకప్పుడు తంజావూరును ఏలిన తెలుగు నాయక రాజులు ఈ కోనేటి గట్టున నలువైపులా 16 దేవాలయాలు కట్టించారని చెబుతారు వాటిలో ఒకటైన విశ్వనాథ దేవాలయం ఉందని, ఆ ఆలయం లో పైన పేర్కొన్న తొమ్మిది నదులు చిత్రాలు శిలలపై చిత్రించారని వాటికి మాఘ పౌర్ణమి రోజున పెద్ద ఎత్తున ఆర్చనాదికాలు జరుగుతాయని చెబుతారు.

బౌద్దులకు కూడా ఈ రోజు ఎంతో పవిత్రమైనది. గౌతమ బుద్ధుడు ఈ రోజే తన మరణం ఎప్పుడనేది వెల్లడించాడని చెబుతారు.ఈ రోజు బౌద్ధ విహారాలలో పలు మతపరమైన కార్యక్రమాలు జరుగుతాయి. వాటిపై మతపరమైన జెండా లు ఎగురవేసి త్రిపిటకాల పఠనం, గౌతమ బుద్దుని ప్రార్థ నలు చేస్తారు.

ఈ మాసంలో.... మాఘ పౌర్ణమి నాడు దేవతలు మానవ రూపంలో భూమి పైకి వచ్చి గంగా స్నానం చేస్తారని పురాణాలు చెబుతున్నాయి.

గురు దోష నివారణ: జాతకంలో గురు దోషం ఉన్నవారు ఈ రోజు నవగ్రహ ఆలయానికి వెళ్లి గురు గ్రహానికి పసుపు వస్త్రంతో పూజించాలి. లేదా ఇంట్లో ఈశాన్య మూలన ఆవు నెయ్యితో దీపం వెలిగించాలి.

**గౌరీదేవి అనుగ్రహం కోసం..**

మాఘ పౌర్ణమి పార్వతీ దేవికి అత్యంత ఇష్టమైన రోజు. పార్వతి దేవిని పూజిస్తే ఇబ్బందులన్నీ తొలగిపోతాయని తమలపాకులలో పసుపు ముద్దతో గౌరమ్మను చేసి గంధం,కుంకుమ బొట్టు పెట్టి దీపం వెలిగించాలి. ఆ పై అక్షతలతో గౌరమ్మను పూజించి, బెల్లం ముక్కను నైవేద్యంగా సమర్పించాలి. ఇలా చేస్తే దాంపత్య సమస్యలు తొలగిపోతాయట అలాగే గౌరీదేవిని స్మరిస్తూ గోరింటాకు దానం ఇవ్వాలి ఇలా చేస్తే గౌరీదేవి అనుగ్రహంతో పెళ్లి కానీ అమ్మాయిలకు త్వరగా పెళ్లి జరుగుతుంది అని చెబుతారు.

మాఘ పౌర్ణమి రోజున నవగ్రహాలున్న ఆలయానికి వెళ్లి గురు గ్రహానికి నమస్కరించి పసుపు రంగు వస్త్రాన్ని పెట్టి పూజించాలి ఎలా చేయలేని వారు ఇంట్లో దేశాన్ని మూలలో వితపెట్టి దానిపై బియ్యప్పిండి ముగ్గు వేసి దానిపై ప్రమిత పెట్టి ఆవు నెయ్యి దీపాన్ని వెలిగించాలి ఇలా చేస్తే జాతకంలో మృదోషం ఉంటుంది తొలగిపోతుందని ప్రవచన కారులు చెబుతున్నారు.

**మాఘస్నాన విశేషం...**

ప్రత్యూషంలో సూర్యోదయానికి అరగంట ముందు చేసే స్నానాలు చాలా ఫలవంతమైనవి. మాఘమాసంలో సూర్యుడు ఉన్న రాశిని బట్టి, ప్రత్యూష కాలంలో సూర్యకిరణాలు పడే కోణా లను బట్టి, ఆ సమయంలో సూర్య కిరణాలలో వుండే అతినీలలోహిత, పరారుణ కిరణాల సాంద్రతని బట్టి సూర్యోదయానికి ముందు చేసే స్నానాలు చాలా ఆరోగ్యవంతమని, ముఖ్యంగా వేగంగా ప్రవహించే నీళ్లలో చేసే స్నానాలు శ్రేష్ఠమనీ చెప్పారు. ఈ స్నానాలకి అధిష్ఠాన దైవం సూర్యభగవానుడు. సప్తాశ్వరథారూఢుడైన ఈ ప్రత్యక్ష దైవం తన కిరణాలనే చూపులతోనే సమస్త సృష్టిని ఆరోగ్య వంతం చేయగల సమర్థుడు. అందువల్లనే స్నానా నంతరం ఆ సూర్యభగవానునికి అర్ఘ్యం సమర్పించటం ఒక ఆచారం.



వ్యాసకర్త
ఆధ్యాత్మిక సాహిత్య వ్యాసభూషణ్, ఆధ్యాత్మక సాహిత్య సామ్రాట్ కావ్యసుధ, హైదరాబాద్,
సెల్ 92473 13488


# తిరుమల లడ్డూ పై కూటమి వి కూతలే

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా డాక్టర్ సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ..

దేశంలోనే 140 కోట్ల భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా తిరుమల దేవస్థానం, లడ్డూ పై విష ప్రచారం చేసిన చంద్రబాబు,పవన్ కళ్యాణ్, లోకేష్ లు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సిబిఐ ఆధ్వర్యంలో వేసిన సిట్ విచారణలో నిజం నిగ్గు తేలిన తర్వాత చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ల కుట్ర బుద్ధి తెలిసిందన్నారు. సిట్ నిజాలు తేల్చిన తర్వాత కూడా సిగ్గు లేకుండా సిగ్గు లేకుండా బొంకు తున్న కూటమి నేతల వైఖరిని డాక్టర్ అప్పలరాజు దుయ్యబట్టారు. తొలుత డాక్టర్ అప్పలరాజు తోపాటు వైయస్సార్సీపి నేతలు, కార్యకర్తలు స్థానిక వెంకటేశ్వర స్వామి దేవాలయం చుట్టూ ప్రదర్శనలు చేశారు. అనంతరం వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేస్తూ కొబ్బరికాయలు కొట్టారు. ఇప్పటికైనా కూటమినేతల బుద్ధి మారాలని,' గోవిందా ' ' గోవిందా ' అంటూ అందరూ నినాదించారు. ఈ కార్యక్రమం తర్వాత మీడియాతో డాక్టర్ అప్పలరాజు మాట్లాడుతూ, పంది కొవ్వు, జంతువుల కొవ్వు కలిసిందంటూ తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ ప్రసాదాన్ని అవమానం పాలు చేశారని ఆయన మండిపడ్డారు. లడ్డూ లో ఎటువంటి కొవ్వులు కలవలేదని సిబిఐ సిట్ నివేదిక సుప్రీం కోర్టుకు ఇచ్చిందని, దీనిపై కూటమి నేతలు ఏం సమాధానం చెబుతారని ఆయన ప్రశ్నించారు. టిటిడి చైర్మన్ కి భారత సుప్రీంకోర్టు తోపాటు న్యాయ వ్యవస్థ పై నమ్మకం లేనట్టు కనిపిస్తుందని, ఇలాంటి వారికి డోనాల్డ్ ట్రంప్ గాని, అంతర్జాతీయ న్యాయస్థానం గాని సమాధానం చెప్పలే మో అన్న అనుమానం కలుగుతుందని ఆయన వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. అలాగే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఏ రకంగా ప్రాయశ్చిత్తం చేసుకుంటారని నిలదీశారు. వెంకటేశ్వర స్వామిని అవమానించి పాపం మూట కట్టు కున్నా రన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతినేలా విష ప్రచారం చేసిన కూటమినేతలను భగవంతుడు క్షమించడని స్పష్టం చేశారు. చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయలేమన్న భయంతో లడ్డు ప్రసాదంలో కల్తీ జరిగిందంటూ ప్రచారం చేసి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందడుగు వేసిన మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని ప్రజల నుంచి దూరం చేసేందుకు చంద్రబాబు అండ్ కో ఇటువంటి నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వైయస్సార్సీపి ప్రభుత్వం లౌకికవాదానికి కట్టుబడి ఎల్లప్పుడూ హిందూ సాంప్రదాయాలు, దేవాలయాల పవిత్రతను కాపాడే లక్ష్యంగానే పనిచేసిందన్నారు. ఇకనైనా సీఎం చంద్రబాబు బాధ్యతా రాహిత్యంగా మాట్లాడడం మానుకొని ప్రజలకు నిజాలు చెప్పాలని ఆయన హెచ్చరించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ పలాసలో భూ ఆక్రమణలపై విచారణకు వచ్చినప్పుడు స్థానిక పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష చేసిన వ్యాఖ్యలపై సమాధానం చెప్పాలని రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ అప్పలరాజును ప్రశ్నించారు. అందుకు డాక్టర్ అప్పలరాజు సమాధానం చెబుతూ, సూది కొండ, జగన్నాథ సాగరం వంటి ప్రాంతాలలో జిల్లా కలెక్టర్ తోపాటు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తన వెంటభూ ఆక్రమణ, కబ్జాదారులను తీసుకువెళ్లి, ఎక్కడ కబ్జా జరిగిందో వైఎస్ఆర్సిపి సమాధానం చెప్పాలని ప్రశ్నించడం హాస్యాస్పదంగాఉందన్నారు. పలాసలో సీతమ్మ గుడి వద్ద ఒక టిడిపి నాయకుడు వంశధార కాలువ గట్టు ఆక్రమించుకునే లేఔట్ వేశాడని, అలాగే కంబిరిగాం సీలింగ్ యాక్ట్ భూము లలో వేసిన ఒక రియల్ ఎస్టేట్ వెంచర్ వివాదాస్పదంగా ఉన్నాయని, కోర్టులో కేసులు ఉండగా ఎవరైనా కొనుగోలు చేస్తే నష్టపోయే ప్రమాదం ఉందని, వైయస్సార్సీపి అధికారంలోకి వస్తే అక్కడ ఆక్రమణలు తొలగిస్తామని, వంశధార కాలువ ఆధునికరిస్తామని ఆయన స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రావెల్ మాఫియా రెచ్చిపోతుందని, తెలుగుదేశం పార్టీ నేతలు కొనసాగిస్తున్న ఈ దందా కే జి ఎఫ్ సినిమామించిపోతుందని, త్వరలో తాము పి జి ఎఫ్ పేరుతో పలాస గ్రావెల్ మాఫియా గురించి ఆధారాలతో సహా బయట పెడతామన్నారు. అదేవిధంగా నల్ల బొడ్లూరు లో ప్రజా వేదిక వైఎస్ఆర్సిపి నిర్వహిస్తుందని , అందుకు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను సాదరంగా ఆహ్వానిస్తున్నామని, ఆమె తన అభిప్రాయాన్ని అక్కడ స్పష్టం చేయవచ్చునని, అందుకు టిడిపి సిద్ధమా? అంటూ డాక్టర్ అప్పలరాజు సవాల్ విసిరారు. పలాస ప్రజలు చక్కగా పరిపాలించమని అవకాశం ఇస్తే, ఎమ్మెల్యే అభివృద్ధిని విస్మరించి రాజకీయ లబ్ధి కోసం ఇష్టారాజ్యంగా ప్రజలను ఇబ్బంది పెట్టడం సబబు కాదన్నారు. తమకు వ్యక్తిగతంగా విమర్శలు చేస్తే అంతకంటే ఎక్కువగా తాము మాట్లాడగలమని, ఈ విషయంపై సానుకూల దృక్పథంతో ఆలోచించి, పరిపాలపై దృష్టి సారించాలని డాక్టర్ అప్పలరాజు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు హనుమంతు వెంకట్రావు దొర, మందస ఎంపీపీ డొక్కరి దానయ్య యాదవ్, వైయస్సార్సీపి పలాస పట్టణ అధ్యక్షులు శిష్టు గోపి, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు పి. గురయ్య నాయుడు, వైయస్సార్సీపి జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి మడియా రామకృష్ణ, వైయస్సార్సీపి యువజన నేత, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్, వైఎస్ఆర్సిపి జిల్లా మహిళా నేత బల్ల కుమారి, వైసీపీ నేతలు మల్ల సురేష్, నర్తు వెంకటరమణ యాదవ్, ఆర్ట్ లక్ష్మణ్, దున్న సత్యం, తమ్మినాన శాంతారామ్, గౌరీ త్యాడి, మందస మండల వైసీపీ నేతలు బాడ జగన్నాయకులు, తలగాన హరికృష్ణ యాదవ్, చెరుకుపల్లి ఎల్లమ్మ లక్ష్మణ్ రావు, పలాస పట్టణ నేతలు తూముల సోమేశ్, యాళ్ల సంతోష్, వైఎస్ఆర్సిపి పలాస రూరల్ అధ్యక్షులు దువ్వాడ రవి, కౌన్సిలర్లు కర్రీ మాధవరావు, బెల్లాల శ్రీనివాస్, దువ్వాడ సత్యవాణి, మద్దిలి బాలకృష్ణ యాదవ్, మజ్జి హేమరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# “నేత్రదానం” మహాదానం

**– రెడ్ క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు**

**నవతరం -శ్రీకాకుళం**



“నేత్రదానం” మహాదానమని, రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. శనివారం ఒక ప్రకటనలో మాట్లాడుతూ స్థానిక మండలవీధికి చెందిన తాళ. లక్ష్మీ 59సంవత్సరాలు తనువుచాలించారని, వారి నేత్రాలను దానం చేయాలని కుటుంబ సభ్యులు తాళ్ళ.కుమార స్వామి, రవికుమార్ నిర్ణయించుకోవటం మహోత్తర ఆలోచనని, కుటుంబ సభ్యులుకు ప్రత్యేక ధన్యవాదాలన్నారు. నేత్ర సేకరణలో భాగముగా మగటపల్లి కళ్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం ఐ టెక్నీషియన్ పూతి.సుజాత, పి. చిన్నికృష్ణల ద్వారా అతని కార్నియాలు సేకరించి విశాఖపట్నంలోని ఎల్.వి.ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారన్నారు. సహకరించిన కుటుంబ సభ్యులకి, డి .రమేష్ కు, కృతజ్ఞతలని, చైర్మన్ జగన్ మోహన రావు, కార్యదర్శి బి.మల్లేశ్వరరావు, కోశాధికారి కె.దుర్గా శ్రీనివాస్, ఇతర సభ్యులు అభినందించారు. ప్రస్తుత కాలంలో నేత్రదానం పై అవగాహన, చైతన్యం ప్రజల్లో పెరుగుతుందని, ఈ విధంగా నేత్రదానం ద్వారా మరొకరికి ఈ ప్రపంచాన్ని చూసే అవకాశం కలుగుతుందని, అంధత్వ రహిత సమాజ స్థాపనకు యువత,ప్రజలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నేత్ర దానం చేయాలనుకునే వారు 78426 99321 నంబరుకు సంప్రదించాలన్నారు

# ఆనంద్ కుటుంబానికి ఎక్సైజ్ సిబ్బంది ఆర్థిక చేయూత

**నవతరం శ్రీకాకుళం**

**- శ్రీకాకుళం ఎన్ఫోర్స్మెంట్ వింగ్‌లో పనిచేస్తూ అనారోగ్యంతో మృతి**

**- రూ.1.90 లక్షల ఆర్థిక సహాయం అందజేత**



ప్రొహిబిషన్ ఛ ఎక్సైజ్ కానిస్టేబుల్స్ ఛ హెడ్ కానిస్టేబుల్స్ అసోసియేషన్, శ్రీకాకుళం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా ఎన్ఫోర్స్మెంట్ వింగ్‌లో ప్రొహిబిషన్ ఛ ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ, 17-01-2026న అనారోగ్య కారణంగా పరమపదించిన వడ్డి ఆనంద్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు.

జిల్లాలో పనిచేస్తున్న కానిస్టేబుల్స్ మరియు హెడ్ కానిస్టేబుల్స్ అందరూ కలిసి రూ.1,90,000/-లను సేకరించి, ఆ మొత్తాన్ని ఆనంద్ కుటుంబానికి అందించారు. ఈ ఆర్థిక సహాయాన్ని అసోసియేషన్ సభ్యులు, ఎన్ఫోర్స్మెంట్ సీఐ, శ్రీకాకుళం టౌన్ సీఐల ఆధ్వర్యంలో, శ్రీకాకుళం డిపీఈఓ తిరుపతి నాయుడు చేతుల మీదుగా ఆనంద్ భార్యకు మరియు ఆయన కుమారుడికి అందజేయడం జరిగింది.

## లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు
# రాజీకి సహకరించండి

### సీనియర్ సివిల్ జడ్జి బి. నిర్మల




**నవతరం టెక్కలి**

నేడు స్థానిక టెక్కలి కోర్టుల పరిధిలోని న్యాయవాదుల సంఘం హాలులో న్యాయవాదులతో సీనియర్ సివిల్ జడ్జ్ బి.నిర్మల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తేదీ 14 .3 .2026 శనివారమున జరిగే జాతీయ లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులు రాజీకి అందరూ సహకరించాలని రాజీమార్గమే రాజ మార్గము అని అన్నారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాజీకి అనుకూలమైన వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించేందుకు న్యాయవాదులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో టెక్కలి కోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షులు పినకాన అజయ్ కుమార్ , ఎ. జి. పి. డి. వి. వివేకానంద ఇతర న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన వేణుగోపాలస్వామి కళ్యాణోత్సవం

**నవతరం-జి.సిగడాం**



ఈ మండలం సంతవురిటిలోని శ్రీ వేణుగోపాలస్వామి కళ్యాణ మహోత్సవాలు గురు,శుక్ర, శనివారాల్లో వైభవంగా జరిగాయి. స్వామి ఉత్సవ విగ్రహాలకు తిరువీధి నిర్వహించారు. అమ్మ యూత్ ఆధ్వర్యంలో అన్న సమారాధన జరిగింది. దేవస్థానం కమిటీ ఛైర్మన్ బాలబొమ్మ వేంకటేశ్వరరావు ఆధ్వర్యం వహించారు. స్థానిక, పరిసర గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు విచ్చేసి స్వామిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.షిరిడీసాయి బృందం వారిచే కోలాటం ప్రదర్శనను నిర్వహించారు. శనివారం ముగింపు సందర్భంగా చక్రస్నానం, పూర్ణాహుతి, పతాక వితరణ జరిగాయి.

## పేదల పాలిట వరం
# ఎన్ టీ ఆర్ భరోసా పింఛన్లు

### ఎ పి విద్యా సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్, పి ఎం జె బాబు

**నవతరం -శ్రీకాకుళం**



స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదేశాలు మేరకు ఆదివారంపేట సచివాలయం పరిధిలో ఎన్ టీ ఆర్ భరోసా పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే పింఛందార్లు ఇంటింటికి వెళ్లి 270 పింఛనుదార్లకు పంపిణీ చేయడం జరిగింది. ప్రతీ నెల ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం పింఛను అందుకోవడం పేదవారి కళ్ళల్లో సంతోషం వ్యక్తం అవుతుంది. సంక్షేమం అభివృద్ధి కూటమి ముఖ్యమంత్రి చంద్రబాబు తోనే సాధ్యం అని జనం నమ్ముతున్నారు. వైకాపా పాలనలో రాష్ట్రం సర్వ నాశనం అయిపోయింది. గాడి తప్పిన పాలనను గాడిలో పెట్టి రాష్ట్రాన్ని అభివృద్ధిపదం లో దూసుకుపోతుంది. చంద్రబాబు చేస్తున్న అభివృద్ధి ని చూసి ఓర్వలేక ప్రభత్వంపై దుష్ప్రచారం చేసే పనిలో వైకాపా నాయకులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో రెండో డివిజన్ ఇంచార్జి అక్కెన రాజారావు, రెడ్డి శివన్నారాయణ, మజ్జి జగన్, నాగేష్ సచివాలయం సిబ్బంది జ్ఞానేష్, వినీత, భారతి, వనిత, ధనలక్ష్మి, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

- ప్రజల మెచ్చిన నేత ....!..
- ఆదర్శ పరిపాలన దక్షులు....!

## సామాన్యులకు సమన్యాయం
# అందించిన మహనీయులు....!

**నవతరం -శ్రీకాకుళం**

గ్రామ అభివృద్ధికి.. ప్రజల సంక్షేమానికి చేసిన సేవలు అజరామరం రైతు బాంధవుడు....!.. ప్రజాస్వామ్య విలువల పితామహుడు రేగులపాడు మొదటి గ్రామ సర్పంచ్ గా సుదీర్ఘకాలం ఆదర్శ పరిపాలన...!.

గ్రామ మనసబు, గ్రామ కరణం గా పని చేసి విశిష్ట సేవలు అందించిన ప్రజాహితులుస్వర్గీయ గొలివె అప్పారావు నాయుడు ఐదవ వర్ధంతి న ఆయన సేవలను స్మరిస్తూ రక్తదాన కార్యక్రమం నిర్వహణ అందరికీ సమన్యాయం జరగాలని కోరుకున్న మహనీయులు స్వర్గీయ గొలివె అప్పారావు నాయుడు అని ఆయన తనయుడు శ్రీకాకుళం సిటిజన్ ఫోరం కార్యదర్శి, ప్రముఖ సంఘ సేవకులు జి ఎల్ ఎల్ నర్సు నాయుడు పేర్కొన్నారు. స్వర్గీయ గొలివె అప్పారావు నాయుడు ఐదవ వర్ధంతి సందర్భంగా శనివారం శ్రీకాకుళం లైన్స్ బ్లడ్ బ్యాంక్ కేంద్రంలో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా నర్సు నాయుడు మాట్లాడుతూ తన తండ్రి కోటబొమ్మాలి మండలం రేగులపాడు గ్రామానికి మొట్టమొదట గ్రామ సర్పంచ్ గా, సుదీర్ఘకాలం మూడు దశాబ్దాల పాటు గ్రామానికి సర్పంచిగా ఆదర్శ పరిపాలన చేసి, విశిష్ట సేవలు అందించారని ఆయన సేవలను స్మరించుకున్నారు. రైతు కుటుంబం నుంచి జన్మించిన మహనీయుడు రైతుల సంక్షేమానికి, వ్యవసాయ భూములకు సకాలంలో నీరు అందించేందుకు, వ్యవసాయ కాలువల ఆధునికీకరణ, నిత్యం గ్రామాభివృద్ధి తో పాటు,



పరిసర ప్రాంతాల ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సంక్షేమానికి, సామాన్యుల సమస్యల పరిష్కారానికి, బడుగు బలహీన వర్గాలకు న్యాయం అందే విధంగా ఎనలేని సేవలు చేశారని, ప్రజల హృదయాలలో సుస్థిర స్థానం పొందిన మహనీయులు అని, సుపరిపాలనకు నిర్వచనం, జనం మెచ్చిన నాయకునిగా, పరిసర ప్రాంతాల గ్రామాల ప్రజలకు స్ఫూర్తినిస్తూ ప్రాంతీయ అభివృద్ధికి ఎల్లప్పుడూ ముందుండి పోరాడిన దిశాలి, మానవతావాది, సంఘసంస్కర్త, జనం మెచ్చిన నాయకులు, గ్రామ సర్పంచిగా సుదీర్ఘకాలం ఆదర్శ పరిపాలన, గ్రామ మునసబు, గ్రామ కరణం వంటి పదవులు నిర్వహించి, తన పరిపాలన ద్వారా ప్రజల హృదయాలలో సుస్థిర స్థానం పొందిన స్వర్గీయ గొలివె అప్పారావు నాయుడు సేవలను స్మరిస్తూ వారి ఐదవ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన రక్తదాన కార్యక్రమం నకు విచ్చేసి స్వచ్ఛందంగా రక్తదానం చేసిన యువకులను అభినందించారు. సహకరించిన ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు. శ్రీకాకుళం సెంట్రల్ లైన్స్ క్లబ్ ప్రతినిధి పొన్నాడ రవికుమార్ ఆదర్శప్రాయణి వర్ధంతి సందర్భంగా రక్తదానం కార్యక్రమంలో నిర్వహించడం అభినందనీయమని, ఆపదలో ఉన్నవారికి రక్తం ఎంతో ఉపయోగంగా ఉంటుందని పేర్కొన్నారు. స్థానిక నాయకులు కే వి ఎస్ ఎస్ నాయుడు , బ్లడ్ బ్యాంకు ప్రతినిధి సుమన్, యువత, తదితరులు పాల్గొన్నారు..

## సీనియర్ న్యాయవాది, మాజీ ఎన్. డి .పి.ఎస్ స్పెషల్ పబ్లిక్
# ప్రాసిక్యూటర్, చీపురు. శ్రీకాంత్ ఆకస్మిక మరణం

### విషాదంలో శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ సభ్యులు...

**నవతరం -శ్రీకాకుళం**

శ్రీకాకుళం పట్టణ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది, మాజీ ఎన్. డి .పి.ఎస్ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, చీపురు. శ్రీకాంత్ ఆకస్మిక మరణం పై తీవ్ర విచారం, ప్రగాడ సానుభూతి వ్యక్తం చేసిన శ్రీకాకుళం పట్టణ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తంగి .శివప్రసాద్, ప్రధాన కార్యదర్శి పిట్ట. దామోదర్, శ్రీకాకుళం జిల్లా కోర్టులో 25 సంవత్సరాలు నుంచి ప్రాక్టీస్ చేస్తున్న సీనియర్ న్యాయవాది, మాజీ ఎన్. డి .పి.ఎస్ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, చీపురు. శ్రీకాంత్ అంచులంచెలుగా ఎదుగుతూ అందరితో స్నేహ భావం కలిగి ఉన్న వ్యక్తి , మృదుభాషి, మిత స్వభావి ఇక లేరు అనే మరణం వార్త ఒక్కసారిగా తోటి న్యాయవాదుల్లో విషాదం కమ్ముకుంది, ఆయనకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసిన వారిలో బార్ అసోసియేషన్ సభ్యులైన ఇప్పిలి. సీతరాజు, భవానీ ప్రసాద్, కొమ్ము .రమణమూర్తి, సీనియర్ న్యాయవాదులైన వాన .కృష్ణచంద్, పార్థసారథి, కిల్లారి. ఈశ్వరరావు, బి . మురళీకృష్ణ, జల్లు. తిరుపతిరావు, కడగల .రాంబాబు నాయుడు, పొన్నాడ. రుషి, అప్పు. పట్నాయక్, నాగు, శ్రీను, ప్రవీణ్ ,సింగ్, శ్యామ్, ఫిలిప్స్, కృష్ణమోహన్, బెందాళం. రమేష్, సీనియర్ మరియు జూనియర్ న్యాయవాదులు, కోర్టు ఆఫీసు సిబ్బంది ఆయన



అంతిమయాత్రలో పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత



**నవతరం -శ్రీకాకుళం**

రోడ్డు భద్రత అనేది కేవలం ఒక నెలకే పరిమితం కాకుండా సంవత్సరమంతా పాటించాల్సిన సామూహిక బాధ్యత అని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల ముగింపు కార్యక్రమం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఉప రవాణా కమిషనర్ విజయ సారథి అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రహదారి నిబంధనలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, క్రమశిక్షణతో వాహనాలు నడపడం ద్వారానే ప్రమాదాల నివారణ సాధ్యమని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రవాణా శాఖ నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు విజయవంతమయ్యాయని, సిబ్బంది కృషి అభినందనీయమని కొనియాడారు. మాసోత్సవాల సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పెదపాడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకులం విద్యార్థినులు ప్రతిభ చాటారు. ఎస్. సోని (8వ తరగతి) ప్రథమ బహుమతి సాధించగా, బి. ధనలక్ష్మి (9వ తరగతి) ద్వితీయ, బి. హాసిని (9వ తరగతి) తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. విజేతలకు కలెక్టర్ బహుమతులు అందజేసి అభినందించారు. ఈ నెల రోజుల పాటు క్షేత్రస్థాయిలో కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిన రవాణా శాఖ అధికారులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఆర్.టి.ఒ ఆర్. అనిల్, మోటార్ వాహన తనిఖీ అధికారులు (ఎం.వి.ఐ) గంగాధర్, కె. శిరీష, ఎస్. శిరీష, జి. శ్రీధర్, డి. సంజీవరావు, ఆర్. గోవిందరాజు, వై. శ్రీనివాస్ ఇతర సిబ్బందిని వారి నిబద్ధతకు గాను అభినందనలు తెలిపారు. రాబోయే రోజుల్లోనూ రోడ్డు భద్రతా చర్యలను మరింత బలోపేతం చేస్తూ, సురక్షిత ప్రయాణం లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**